# గరీబ్ కు హటావో

ఎల్. యస్. జయంతి, Fds 9

మావాచాలరావుగురించిమీకసలు చెప్పలేదు కదూ! వాడిపేరు అసలు వాచాలరావు కాదు-వానవల్లి వీర వెంకట సత్య సూర్య సుబ్రహ్మణ్య చాముండీ వరప్రసాద లక్ష్మీనరసింహరావు, కానీ వాళ్ళమ్మ ఎక్కువ వసపోసి పెంచిందని నలుగురూ అనుకుంటూంటారు. అంచేత వాడిపేరులో దొరికే అక్షరాలతో నేనుముద్దుగా వాచాలరావు అని పిలుస్తాను! ఎంతకాదన్నా స్వంత చిన్ని కొడుకునే కనుక నేనెల్లా పిలిచినా ఏమనుకోడు

అనలు జరిగిందేమిటంటే—రోజూలాగే వాడూ నేను సాయంత్రం షికారుకు బయల్దేరాం కాలవ వంతెన దాటి గట్టువెంబడే కొంతదూరం పోయిరావటం మా కలవాటు. ఒక బిచ్చగాడు వంతెనకెదురు గుండా మిఠాయికొట్టు దగ్గర కూర్చుని బాబూ ఆకలేస్తుంది. ఏదేనా యిప్పించండి అని దారినపోయే వాళ్ళని యాచించడం వాడి గ్రహపాటు! వాడిని చూసినప్పటి నుండి మేమింటికి తిరిగివెళ్ళేవరకూ బిచ్చగాండ్లనీ, వాళ్ళ యాచననీ, వాళ్ళని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాన్ని అల్లాంటి ప్రభుత్వంలో ఉద్యోగం చేస్తున్న నన్నూ దుయ్యబట్టడం మా వాచాలుడికో దురలవాటు కాని తైల సంస్కారం లేని జుట్టూ, జీర్ణించుకుపోయిన వస్త్రాల్లోనూ వున్నా వాడేదో బ్రతికిచెడ్డ మనిషేమో అన్నభావం తళుక్కుమంటుంది. నాకో ఎందుకంటే అందరి బిచ్చగాండ్లలాగా వాడు డబ్బు లడగడు. ఏదేనాతిండే పెట్టమని అడుగుతాడు కనుక (ఇది నాస్వంత ఆలోచన, స్వగతం) వాణ్ణి నేను వెనకేసుకొచ్చేకొద్దీ వాచాలుడి సహజ పైత్య ప్రకర్ష పెరుగుతూంటూంది.

ఒకరోజు-నా అభిప్రాయాలు తల్లకిందులు చేద్దామని మావాడు బిచ్చగాడి దగ్గరకుపోయి 'ఈరోజుల్లో ఇదో శ్రమలేని వుద్యోగమైపోయింది. రాయిలాగా వున్నావు ఏదేనా పనిచేసుకోకూడదూ. అడుక్కోక పోతే' అంటూ మొదలుపెట్టాడు. మావాణ్ణి మధ్యలోనే అడ్డుకొని "చేస్తా బ్రదర్, కాని 14 సంవత్సరాలు జైల్లోవున్ననన్ను నమ్మి ఎవరు పనిస్తారు.' దీనంగా బిచ్చగాడి గుండెలు పలుకుతున్నాయి. వాడి సంస్కారవంతమైన సంభాషణ విని వాచాలుడు ఫుల్‌స్టాపు పెట్టినట్లు ఆగిపోయాడు. ఎందుకంటె M.A. First Class లో పాసయి మూడేళ్ళనుండి అప్రయోజక రావులా కూర్చున్న పెద్దమనిషి వీడు. నాకెందుకో ఇంకా వివరాలు తెల్సుకోవాలన్పించింది. ACTO నైన నాకు అతనికో దుకాణంలో పని యిప్పించడం కష్టమైన పనికాదు. కానీ నీరసంగా వస్తున్న వాడి మాటలు వారం పదిరోజులనుంచి అన్నం తినలేదన్న భావాన్ని తెలియచేస్తున్నాయి. నాతోవస్తే నీకుభోజనం పెట్టిస్తా తర్వాత పనివిషయం ఆలోచించవచ్చని మాయింటికి తీసుకవచ్చానతన్ని మా ముగ్గురికని మా శ్రీమతి వండిన అన్నాన్ని ఆవురావురు మంటూ ఒక్క మెతుక్కూడా మిగల్చకుండా తినేసిన అతన్ని చూస్తూంటే మా వాచాలుడికి కళ్ళమ్మట బొటబొటా కన్నీళ్లు కారాయి, భోజనం అయిన తర్వాత మీరుణం ఈ జన్మలో తీర్చుకోలేనుబాబూ-కృతజ్ఞత వ్యక్తం చేశాడు, ఇప్పుడు స్థిమితంగా చెప్పమన్నాను, అసలు విషయమేమిటో.

అతడు చెప్పినకథ — "చిన్నప్పుడే తండ్రిని పోగొట్టుకోవడం నా నేరమా బాబూ! మా తల్లి గతి లేక మా కామందుల యింట్లోనే పనిచేయటం, దానా దీనా నాకు H S. C. వరకూ దొరగారు చదువు

చెప్పించారు. ఒక రోజు ఓరే నన్నా నీ చదువయింది కనుక మన మిల్లులోనే చేరిపోరా గుమాస్తాగారినడుగు వివరాలు చెబుతారు అన్నారు దొరగారు. గుమాస్తాగారెప్పుడూబట్టల మిల్లుదగ్గరే వుంటారు. ఆయన నన్ను బట్టల గోడౌనులోంచి అండర్ గ్రౌండు లోకి తీసుకెళ్ళారు అప్పుడర్థమయింది. బాబూ, బట్టలమిల్లు మూసి ఏడాదైనా గుమాస్తాగారు రోజూ అక్కడే ఎందుకుంటారో, అక్కడ నేను చూసింది మనీ మిల్లు బాబూ. ప్రింటింగ్ మిషనూ పేపరు కట్టలు, కటింగ్ మిషనూ, ౫,౬ గురు మనుషులూ లక్షల విలువైన నోట్లు, యిదే బాబూ ఆ ప్రపంచం భోజనం, వసతీ అన్నీ అక్కడే పేకాడుకుంటూ వేలకువేలు ఓడిపోతున్నా మాలో ఎవరికీ చీమకుట్టినట్లయ్యేది కాదు. ఎందుకంటేమేము లక్షలమధ్యలోనే బంధింపబడ్డాము.

గుమాస్తాగారు తీసుకొచ్చే దినపత్రికలవల్ల మాకు సంగతులు తెలుస్తుండేవి. ఎలక్షన్లు వస్తున్నాయని, ఎలక్షన్లువచ్చేశాయని, ఎలక్షన్లలో దొరగారునెగ్గారని, అన్నీ పేపర్లలో చదువుతూండేవాళ్ళం. ఆ టైములో మాకు రాత్రివగలు ముమ్మరంగా అచ్చు వేయాల్సి వచ్చేది దొరగారు M L. A నన్ను బొంబాయి మార్వాడీలకు పైకం యిచ్చిరమ్మని పంపారు. బట్టలమ్ముకొనే వాడి వేషం, బట్టల మూటలో నోట్లకట్టలు ఆత్మరక్షణకు పిస్తోలు. పని సక్రమంగా ముగించుకొని తిరిగి వచ్చేటప్పటికి ఊరంతా కోడై కూస్తోంది దొరగారి బట్టలమిల్లు, గోడౌను రాత్రికి రాత్రి వరకు రామ ప్రీతి అయిపోయాయట. దొరగారికి ఇన్సూరెన్సు ౯ లక్షలు వస్తుందట. నాతోపాటు పని చేసిన వాళ్ళు ఆ నిప్పుల్లో బూడిదై యుంటారని నా పాడు బుద్ధికి తోచనేలేదు బాబూ.

విధి నా జీవితంతో ఆటలాడిన ఆరోజు—దొరగారు ఐదువేలు తీసుకెళ్ళి గుమాస్తాగారికిమ్మన్నారు. డబ్బు సర్దిన బాక్సూ, జేబులో పిస్తోలు, నేనూ గుమాస్తా గారింట్లో అడుగు పెట్టాము. హాల్లో బోర్లా పడి వున్నారు గుమాస్తా గారు. ఏం జరిగిందోనని బాక్సు పక్కన పడేసి గుమాస్తాగార్ని వెనక్కితిప్పేసరికి, ఆయన వేస్టుకోటునిండా రక్తం—నా చేతుల్లో అచేతనంగా వేళ్ళాడుతోంది ఆయన శవం తక్షణం కర్తవ్యం గుర్తుకొచ్చింది దొరగారితో చెబుదామని ఒక్క వురుకులో వీధిలో పడ్డాను. ఎదురుగా దొరగారు కారులోంచి దిగుతున్నారు "బాబుగారూ... గుమాస్తాగారు..." "ఏం జరిగింది లోపలికి నడు" గంభీరంగా దొరగారు. లోపలికి వెళ్ళేటప్పటికి దృశ్యం మారింది, గుమాస్తాగారి భార్య జుట్టు విరబోసుకుని గుండెలవిసేలా ఏడుస్తుంది. దొరగారికి నన్ను చూపెడుతూ వీడే వీడే పట్టుకోండి అంటూ అరిచింది అయోమయంలో నేను-ప్రజానాయకుడు దొరగారు, ప్రజాభద్రతల్ని కాపాడే D.S P గారికి ఫోను చేశారు. నా చేతులకు బేడీలు. మర్నాడు కోర్టులో విచారణ. సాక్ష్యాయి, తీర్పు– కర్మకాండ సక్రమంగా (దొరగారి దృష్టిలో) జరిగాయి నాకు 15 సంవత్సరాలు ఘోరమైన కారాగారవాసం. ఎందుకు? నేను గుమాస్తా గారింట్లో డబ్బు దొంగలించేందుకు వెళ్ళెనట. నాపని ముగించుకొని తిరిగి వచ్చేస్తూంటే గుమాస్తాగారు అడ్డువడ్డారట. తప్పించుకుందుకు నేను హత్య చేశాను. హతుడి భార్య ఈ విషయాన్ని (హత్య మాత్రమే) కళ్ళారా చూసింది. దొంగతనం కప్పిపుచ్చుకుందుకు హత్య. పిస్తోలుమీద, డబ్బున్న పెట్టెమీద, గుమాస్తాగారి కోటుమీద వేలిముద్రలు నావే. అందుకని ఆ (అ) న్యాయ స్థానం తీర్మానం, ఆజన్మాంత కఠోరశిక్ష.

జైలులో కూర్చుని ఆలోచిస్తూంటే నాకు కలిగిన ఆలోచనలు కూడా మీకు చెప్పాలి బాబూ. దొంగనోట్లను గురించి తెలిసి ఇంకా బ్రతికున్న నన్నూ, గుమాస్తాగారిని, తనదారికి అడ్డులేకుండా దొరగారు తప్పించి వుండవచ్చు. గుమాస్తా గారి భార్య ప్రతి సాయంత్రం (తల్లిలేని) దొరగారి పిల్లాడ్ని ఆడించేందుకు తీసుకెళ్ళి తిరిగి రాత్రి తొమ్మిదింటికి దిగబెడ్తుంది కదా! దొరగారి ప్రాపకం మరిగే యింకా

గుమాస్తా ఎందుకు? తోటలోని ముళ్ళు ఏరి పడవేయటం విజ్ఞుల లక్షణం. ఇదంతా దొరగారు, గుమాస్తా గారిభార్య చేసిన కుట్రఅని నేనంటే హత్య తప్పించుకుందుకు నేనల్లిన కథ అంటారు.

జైలులో నాకు కలిసిన దోస్తు రహీమ్. అతనే కారు ఏక్సిడెంటులో దొరగార్ని చంపాడు ఎందుకు చంపాడు? రాయుడుగారు చంపించారు రాయుడు గారెవరు? అదే జిల్లాలో మరొక ప్రజానాయకుడు. తన మంత్రి పదవికి పోటీ వస్తున్న దొరగార్ని రాయుడుగారు చంపించరా మరి. ఇప్పుడు రాయుడు గారు మంత్రి. రహీమ్ హంతకుడు. హిందీ రాని మంత్రి గారు "గరీబీ కు హటావో" (పేదవాడిని నిర్మూలించు) అని ప్రసంగాలు చేస్తున్నారు. నా సత్ప్రవర్తనకు మెచ్చి నన్ను ఒక సంవత్సరంముందే విడుదల చేశారు. మొదటి పద్దెనిమిదేళ్ళ సత్ప్రవర్తన అప్పటి న్యాయస్థానానికి గుర్తురాలేదు ఇప్పుడు ప్రభుత్వానికి నా సత్ప్రవర్తన గుర్తుకు వచ్చింది.

మీదొరగారిపేరు ఫణిభూషణరావు కదూ అన్నాను నేను. ప్రక్క గదిలోంచి వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దం వాచాలుడిదే తనతండ్రిన్నేహితుడు రాయుడు మంత్రి అయికూడా తనకేమీ ఉద్యోగం యిప్పించక పోవటమే ద్రోహం అని ఆలోచించేవాడికి, ఈ బిచ్చగాడి కథలోని నిజాలు భరించేశక్తి ఎక్కడవుంటుంది అదీకాక తనకు 11 సం॥ అప్పుడు జరిగిన సంఘటనలు లీలగా వాడి మనసులో కదిలి వుండచ్చు తల్లిని మరపించి పెంచిన ఆంటీ ప్రేమ వెనుకనున్న కథ వాణ్ణి తలక్రిందులు చేసే వుండచ్చు.

*With best compliments from :*

Phone : Offi : 20800
Res : 22030

Grams : SUVARNA
GUNTUR-31

# Suvarna Tobacco Company

**Etukuru Road, GUNTUR-3**

**S. INDIA**